ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కర్ణాటక వార్తలు

శనివారం 12 ఏప్రిల్ 2025

## పరిసరాలు మరిచి..!

● నమ్మ మెట్రో స్టేషన్‌లో యువజంట ప్రవర్తనపై విమర్శలు

బెంగళూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని నమ్మ మెట్రో స్టేషన్‌లో ఓ యువ జంట ప్రవర్తించిన తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మెజిస్టిక్ మెట్రో స్టేషన్‌లో రైలు కోసం క్యూలో ఉన్న సమయంలో ఓ యువకుడు తనతో వచ్చిన యువతి టీ షర్టులో చెయ్యిపెట్టి కనిపించాడు. అక్కడే ఉన్న కొందరు ఈ దృశ్యాలను మొబైల్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో గురువారం అప్‌లోడ్ చేశారు. మెట్రో స్టేషన్‌లో ఇలా ప్రవర్తించడం పట్ల నెటిజన్లు తీవ్ర విమర్శలు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ఉన్నామన్న విచక్షణ కోల్పోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కేబినెట్ చేతికి కులగణన..!

● సమగ్ర సమాచారంతో నివేదిక
● 54 అంశాలపై వివరాల సేకరణ
● 17న తుది నిర్ణయానికి మంత్రివర్గ భేటీ
● బీజేపీ పాలనలో 40శాతం కమీషన్‌పై 'సిట్' విచారణకు తీర్మానం
● మీడియాతో మంత్రి శివరాజ్ తంగడగి



బెంగళూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇన్నేళ్లుగా ఎదురు చూసిన కులగణన నివేదిక ఎట్టకేలకు ప్రభుత్వం స్వీకరించింది. శుక్రవారం కేబినెట్ సమావేశంలో కులగణను స్వీకరించిన అనంతరం కన్నడ సంస్కృతిశాఖ మంత్రి శివరాజ్ తంగడగి మీడియాతో మాట్లాడారు. నివేదికతో అందరికీ సమన్యాయం జరగనుందని, సమగ్ర సమాచారంతో కులగణన జరిగిందన్నారు. 2015 ఏప్రిల్ 11న కులగణన సర్వేను ప్రారంభించి అదే ఏడాది మే 30న ముగించారన్నారు. 50రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా సర్వే జరిగిందన్నారు. 6.35 కోట్లమంది జనాభాలో 5.98 కోట్ల జనాభాకు సంబంధించి కులగణన వివరాలు సేకరించారన్నారు. 1.35 కోట్ల కుటుంబాల ప్రకారం 94.17 శాతం సమాచారం అందించడంలో భాగస్వాములయ్యాయన్నారు. 37లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదన్నారు. హెచ్ కాంతరాజ్ నేతృత్వంలో బీసీ కమిషన్ సర్వే జరిపిందన్నారు. సమీక్ష ప్రకారం ప్రతి కుటుంబం సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ ప్రాతినిధ్యం, ఉద్యోగ స్థితిగతులతోపాటు 54 అంశాలపై సమాచారం సేకరించారన్నారు. సర్వేకోసమే ఆరుగురు నిపుణులు, 16మంది వివిధ అంశాల ప్రతిభావంతులతో సభలు జరిపి నివేదికకు అవసరమైన మార్గదర్శకాలను సిద్ధం చేశామన్నారు. శివమొగ్గలోని కువెంపు విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ జోగన్, ప్రొఫెసర్ అబ్దుల్ అజీజ్, డాక్టర్ ఆంబ్రోస్ వింటో, డాక్టర్ లక్ష్మణ్, లక్ష్మీపతి, రాజలక్ష్మి కామత్, నవీన్‌భారతి ఉన్నారన్నారు. బీఈఎల్ సంస్థతో రూ.43.09 కోట్లతో ఒప్పందం చేసుకున్నామన్నారు. కేంద్రం రూ.7కోట్లు, రాష్ట్రప్రభుత్వం 185.79 కోట్ల రూపాయలతో కలిపి 192.79 కోట్లు విడుదలైందన్నారు. సమీక్షకోసం ఇప్పటివరకు 165.51 కోట్ల రూపాయలు ఖర్చు చేశామన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ బెంగళూరు ద్వారా ధ్రువీకరణ జరిగిందన్నారు. 2019 సెప్టెంబరుతో అప్పటి బీసీ కమిషన్ ఛైర్మన్ కాంతరాజ్ పదవీకాలం ముగియడంతో నివేదిక ప్రభుత్వానికి సమర్పించలేకపోయారన్నారు. 2020 నవంబరులో జయప్రకాశ్ హెగ్డే నేతృత్వంలోని బీసీ కమిషన్ ఏర్పాటు కాగా 2024 ఫిబ్రవరిలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. అప్పటి నుంచి నివేదికను ప్రభుత్వం స్వీకరించే విషయమై తర్జన భర్జన సాగింది. వీరశైవలింగాయ సామాజిక వర్గాలు వ్యతిరేకించగా, బీసీ కులాలు ప్రతిపాదనకు డిమాండ్ చేశాయి. ఇలా సాగుతుండగానే ఇటీవల మూడు నెలలుగా సీఎం సిద్దరామయ్య బీసీ కమిషన్ నివేదికను స్వీకరిస్తామని ప్రకటించారు. కేబినెట్‌లో సమగ్ర చర్చ జరగాలని, మంత్రుల అభిప్రాయాలు తీసుకోవాలని 17న ప్రత్యేక సమావేశం జరపదలిచారన్నారు.

### 17, 24 తేదీల్లో కేబినెట్ భేటీ

సాధారణంగా వారానికోరోజు మాత్రమే కేబినెట్ సమావేశం జరుపుతారు. అటువంటిది ఈనెల 17, 24 తేదీలలో వరుసగా కేబినెట్ సమావేశాలు జరపాలని తీర్మానించారు. ఈనెల 17న బీసీ కమిషన్ నివేదిక తీర్మానం కోసమే ప్రత్యేకంగా సమావేశం అవుతున్నారు. సాయంత్రం 4 గంటలకు కేబినెట్ భేటీ ఉంటుందని కేబినెట్ సెక్రటరీ చంద్రశేఖర్ ప్రకటించారు. ఈనెల 24న చామరాజనగర్ జిల్లాలోని మలెమహదేశ్వరలో కేబినెట్ భేటీకి తీర్మానించారు. గతంలో రెండుసార్లు మలెమహదేశ్వరలో కేబినెట్ భేటీ జరపాలని నిర్ణయించినా పలు కారణాలతో వాయిదా పడింది. ఈనెల 24న ప్రత్యేకంగా జరపదలిచారు. ఇటీవలే కలబురగిలో కేబినెట్ భేటీ జరగగా తాజాగా మలె మహదేశ్వరలోనూ నిర్వహించదలిచారు.

### మీడియాలో కులగణన నివేదిక హల్‌చల్

కేబినెట్ తీర్మానానికి ముందే కులగణనకు సంబంధించి నివేదికలోని అంశాలు బహిరంగం అయ్యాయని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. పలు మీడియా చానెళ్లు ప్రసారం చేశాయి. వాటి ప్రకారం రాష్ట్రంలో ఎస్సీలు 1.08 కోట్లు, ముస్లింలు 75లక్షలు, లింగాయత 73, ఒక్కలిగ 70, కురబలు 45, ఎస్టీలు 42, మరాఠాలు 16 లక్షలు, విశ్వకర్మ 15 లక్షలు, బ్రాహ్మణ 15లక్షలు, బెస్తలు 14.5 లక్షలు, ఈడిగలు 14, క్రైస్తవులు 12లక్షలు, యాదవ 10.5లక్షలు, అలెమారి, ఉప్పార, మడివాళ 7 లక్షల చొప్పున, కుమ్మర 5లక్షలు, తిగళ 5లక్షలు, సవితా సమాజ 4.5లక్షలు, జైనులు 3లక్షలుగా ఉన్నట్టు ప్రచారమైంది. ఈ నివేదిక గతంలోనూ వైరల్ అయిన విషయం తెలిసిందే. అయితే ఇన్నాళ్లుగా కులగణన నివేదికపై ఎదురు చూపులు చూస్తున్న రాష్ట్ర ప్రజలకు ఎట్టకేలకు నివేదిక చేరడంతో ఆశలు పెరిగాయి.

### దశాబ్దకాలంగా ఎదురుచూపు..

దశాబ్దకాలం కింద బీసీ కులాల ప్రగతిపై సమగ్రత కోసం సామాజిక, విద్య సమీక్ష పేరిట జరిగిన కులగణన నివేదిక ఎట్టకేలకు కేబినెట్ స్వీకరించింది. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం జరిగింది. రాష్ట్ర బీసీ కమిషన్‌కు గత ఏడాది ఫిబ్రవరిలో సమర్పించిన నివేదికను ప్రభుత్వం స్వీకరిస్తుందని గత కొన్ని నెలలుగా సీఎం సిద్దరామయ్య ప్రకటిస్తూ వచ్చారు. వీరశైవలింగాయత సామాజికవర్గం నివేదికను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించరాదని వ్యతిరేకిస్తూ వచ్చాయి. అయితే బీసీ కులాలు పట్టుబడుతుండడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సీల్డ్ కవర్‌లో బీసీ కమిషన్ అందించిన నివేదికను కేబినెట్‌లో ఓపెన్ చేశారు. సంబంధిత నివేదికపై చర్చించారు. అయితే సమగ్ర చర్చలతోపాటు మంత్రుల అభిప్రాయం తర్వాత నిర్ణయం తీసుకునేందుకు ఈనెల 17న ప్రత్యేకంగా కులగణన సర్వేపైనే కేబినెట్ భేటీ జరపాలని తీర్మానించారు.

### బీజేపీ పాలనలో 40శాతం కమీషన్‌పై 'సిట్'కు ఓకే

బీజేపీ పాలనలో కాంట్రాక్టర్ల సంఘం ఫిర్యాదుకు అనుగుణంగా 40శాతం కమీషన్‌పై ఏర్పాటైన మాజీ న్యాయమూర్తి నాగమోహన్‌దాస్ నేతృత్వంలోని కమిషన్ సమర్పించిన నివేదికకు సమగ్ర దర్యాప్తునకు కేబినెట్ తీర్మానించింది. దీంతో స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. కమిషన్ 3లక్షల పనులకు సంబంధించి 1729 పనులను మాత్రమే శాంపిల్ రూపంలో విచారణలు జరిపింది. అయితే సమగ్ర నివేదికకు మరిన్ని పరిశీలనలు అవసరమని కేబినెట్ తీర్మానించింది.



ధర్మరాయస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి

భక్తజనం మధ్య

## హసి కరగ

● భారీగా తరలి వచ్చిన భక్తులు
● నేడు బెంగళూరు కరగ

బెంగళూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన బెంగళూరు కరగ ఉత్సవాల్లో భాగంగా హసికరగ వేలాదిమంది భక్తజనం మధ్య జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున 1నుంచి 4 గంటల మధ్య హసికరగ ఊరేగింపు జరిగింది. పూజారి జ్ఞానేంద్ర హసికరగను ఒడిలో పెట్టుకుని ఊరేగారు. పూజారి వెంట వేలాదిమంది తిగళ సామాజికవర్గానికి చెందిన వారు పాల్గొన్నారు. హసికరగ వెంట ఖడ్గధారులు నడిచారు. వివిధ ప్రాంతాల మీదుగా ఊరేగింపు జరిగింది. అంతకుముందు రోజు వందలాదిమంది మహిళలు జ్యోతులు మోశారు.

### నేడు కరగ ఉత్సవం

ఏడాదికోసారి నగరంలో అద్భుతం అనిపించేలా సాగే కరగ ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. శనివారం తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభంకానున్నాయి. ఆ తర్వాత ధర్మరాయస్వామి ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయి. సాయంత్రం 6 గంటలనుంచి పూజల్లో వేలాదిమంది భాగస్వాములు అవుతారు. రాత్రి 11 గంటలకు ధర్మరాయస్వామి ఆలయం నుంచి రథోత్సవం కొనసాగనుంది. రాత్రి 12 గంటల తర్వాత కరగను తలపైమోసుకుని పూజారి జ్ఞానేంద్ర ఆలయంనుంచి బయల్దేరుతారు. నగరత్‌పేత నుంచి అవెన్యూరోడ్డు, అణ్ణమ్మ దేవస్థానం, కుంబారపేట, బీవీకే అయ్యంగార్ రోడ్డుల మీదుగా కరగ కొనసాగుతుంది. సిటీ మార్కెట్‌లోని దర్గాకు వెళ్తుంది. అక్కడనుంచి తిరిగి ఆలయానికి చేరుకునే సరికి ఆదివారం ఉదయం అవుతుంది. కరగ ఉత్సవంలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాలనుంచి తిగళ సామాజికవర్గానికి చెందినవారు వచ్చేశారు. ప్రత్యేకించి తమిళనాడులోని కృష్ణగిరితోపాటు పలు ప్రాంతాలనుంచి భక్తులు అధికంగా వస్తున్నారు.



జ్యోతుల ఊరేగింపులో మహిళలు



హసికరగ ఊరేగింపు





కర్ణాటక వీవీ వీసీ హోదాకు

## 170 దరఖాస్తులు

బెంగళూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ధారవాడలోని కర్ణాటక విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ హోదాకోసం 170 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో కర్ణాటక యూనివర్సిటీలో అధ్యాపకులుగా కొనసాగుతున్నవారే 20మంది ఉన్నారు. వైస్‌చాన్స్‌లర్ నియామకం కోసం పరిశీలనా కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో మాజీ కులపతులైన ఏహెచ్ రాజాసాబ్, కైలాశ్‌చంద్రశర్మ, తళవార, బుందేల్‌ఖడ్, పీఆర్ థాపక్ తోపాటు ఉన్నతవిద్యాశాఖ డిప్యూటీ సెక్రటరీలు కమిటీలో ఉన్నారు. కర్ణాటక యూనివర్సిటీ ఇటీవలే అమృత మహోత్సవాన్ని జరుపుకున్నారు. 2024 సెప్టెంబరులో వైస్‌చాన్స్‌లర్ పదవీకాలం ముగిసింది. అప్పటినుంచి ఇన్‌చార్జ్ హోదాలో వీసీగా వ్యవహరిస్తున్నారు. కర్ణాటక యూనివర్సిటీలో అధ్యాపకులుగా కొనసాగుతున్న రిజిస్ట్రార్ ఎన్‌వై మట్టిహాళ్, ప్రొఫెసర్ టీబీ బసవనగౌడ, కమనవళ్ళి, ఎంహెచ్ అగడి, ఆర్ఎల్ హైదరాబాద్, ఏబీ వేదమూర్తి, షౌకత్ అజీం, మల్లికార్జున పాటిల్, కృష్ణా నాయక్, విజయపుర మహిళా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఓంకార కాకడెతోపాటు కువెంపు యూనివర్సిటీ, మైసూరు యూనివర్సిటీ, మంగళూరు యూనివర్సిటీల అధ్యాపకులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 22న పరిశీలనా కమిటీ దరఖాస్తులు క్రోడీకరించనున్నారు. రెండు నెలల్లో వీసీని నియమిస్తామన్నారు.

## 'జ్యువెల్స్ ఆఫ్ ఇండియా' ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న నటి హితా చంద్రశేఖర్ తదితరులు

బెంగళూరు, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): జ్యువెల్స్ ఆఫ్ ఇండియా ప్రదర్శనలు శుక్రవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. నగరంలోని తాజ్ వెస్టెండ్ హోటల్‌లో ప్రముఖ నటి హితా చంద్రశేఖర్ ప్రారంభించారు. జ్యువెల్స్ ఆఫ్ ఇండియా కన్వీనర్ విక్రమ్ మెహతా, కో కన్వీనర్ హేమంత్‌జైన్‌ల పర్యవేక్షణలో ప్రదర్శనలు సాగాయి. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 40కుపైగా పేరొందిన ఆభరణాల సంస్థలు భాగస్వాములయ్యాయి. ఈ సందర్భంగా నటి అక్షతా మాట్లాడుతూ బంగారం విలువ పెరిగిందని అయినా ప్రతి మహిళ బంగారం పట్ల అభిమానం చూపుతారన్నారు. నాణ్యమైన కొత్త డిజైన్లు, దేశంలోని వివిధ ప్రాంతాల డిజైన్లు ఒకేచోట లభించేలా జ్యువెల్స్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకావడం సంతోషమన్నారు. గజరాజ్ జ్యువెల్స్ ముఖ్యులు విజయకుమార్, ఎంపి స్వర్ణమహల్ యజమాని సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. మూడు రోజులపాటు ప్రదర్శనలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.



భీమ హెజ్జె 100ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

### అవినీతి ప్రభుత్వమని కాంగ్రెస్ నేతలే ఒప్పుకున్నారు

7

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

## రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

రాయచూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సరిహద్దు జిల్లా యాదగిరిలో గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రమాద స్థలంలోనే నలుగురు దుర్మరణం పాలయ్యారు. శాపూర్ తాలూకా భీమరాయనగుడి సమీపంలో మద్రికి క్రాస్ జాతీయ రహదారి 150ఏ వద్ద ఆర్టీసీ బస్సును బొలెరో వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బొలెరో వాహనంలో వెళుతున్న కర్కనహళ్ళి గ్రామానికి చెందిన డ్రైవర్ శరణప్ప(26)తో పాటు సునితా(30), సోమవ్వ(45), తంగమ్మ(32) అక్కడికక్కడే మృత్యువాతపడగా మరో 12మంది తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రిలో చికిత్సనందిస్తున్నారు. విషయం తెలుసుకున్న యాదగిరి ఎస్పీ, అడిషనల్ ఎస్పీలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సంఘటనకు సంబంధించి భీమరాయనగుడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బొలెరో వాహనంలో దైవ కార్యం కోసం వెళుతున్న ఒకే కుటుంబానికి చెందిన పలువురు ప్రమాదం బారిన పడినట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు



పరిశీలిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

# రైతులను ముంచిన వడగండ్లు



కంప్లిలో నీటి పాలైన వరి పంట



● అకాల వర్షానికి అన్నదాత కుదేలు ● గాలివానతో నేలకొరిగిన వరిపంట
● తుంగభద్ర పరీవాహక ప్రాంతంలో 10 వేల ఎకరాల్లో నష్టం
● పిడుగుపాటుకు బళ్లారి జిల్లాలో యువకుడు.. కొప్పళ జిల్లాలో ఇద్దరు బలి



వడగండ్లు



తడిసిన వరి ధాన్యం

బళ్లారి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అన్నదాతను అకాల వర్షం నిలువునా ముంచేసింది. గురువారం రాత్రి కురిసిన వడగండ్లవాన, ఈదురుగాలులకు చేతికి వచ్చిన పంట నేలపాలైంది. తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో సాగు చేసిన సుమారు 10వేల ఎకరాల వరిపంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. సుమారు రూ.కోట్లలో నష్టపోయినట్లు అంచనా. తుంగభద్ర జలాశయంలోని కొప్పళ, రాయచూరు, బళ్లారి తదితర తుంగభద్ర ఆయకట్టు ప్రదేశాలలో కోతకువచ్చిన వరి పంట నీటిపాలయ్యింది. ఎకరానికి సుమారు 50వేల వరకు ఖర్చయిందని, చేతికి వచ్చిన పంట నేలపాలవడంతో నిండా మునిగిపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరిపంటను పరిశీలిస్తున్నరైతు సంఘం నాయకులు

### కొప్పళ జిల్లాలో ఇద్దరు..

గంగావతి రూరల్: కొప్పళజిల్లాలో గురువారం రాత్రి సింధోగి రోడ్డు సమీపంలోని పొలంలో పిడుగుపాటుకు గురై ఇద్దరు మృతులను కొప్పళలోని గౌరియాంగళ లేవుట్‌కు చెందిన మంజునాథ్ గాలి(48) గోవిందప్ప మగలమణి(62)గా గుర్తించారు. తుంగభద్ర బ్యాక్ వాటర్ ప్రాంతంలో వడగండ్ల వాన, ఈదురు గాలులకు మొక్కజొన్న పంట భారీగా దెబ్బ తినింది. పంట నేల రాలి భారీ నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు.



నేలకొరిగిన మొక్కజొన్న పంట

### కారటగిలో నేలరాలిన వరి పంట

కంప్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లాలో వడగండ్ల వాన రైతులను నిద్ర లేకుండా చేసింది. గురువారం రాత్రి పలు ప్రాంతాల్లో వడగండ్ల వర్షం కురిసింది. వరి పంట నేలగొరింది. కారటగిలో శుక్రవారం సాయంత్రం వడగండ్ల వర్షం కురిసింది. పొలాల్లో వరి సంచులు తడిసిపోయాయి. ఉరుములు మెరుపులతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. ఆరుబయట మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధంగా వుంచిన వరిధాన్యం వర్షానికి తడిసిపోయింది.



నేలపాలైన వరి పంట

### పిడుగుపాటుకు బాలుడి మృతి

బళ్లారి సిటీ: పిడుగుపాటుకు బాలుడు బలయ్యాడు. జోరుగా వర్షం కురుస్తుండంతో ఇంటిపై ఆరబెట్టిన బెడ్ షీట్ తీసుకొని పాండునాయక్(16) ఇంట్లోకి వెళ్తున్నాడు. బాలుడు పిడుగుపాటుకు గురై మరణించిన ఘటన గురువారం సాయంత్రం కూడ్లిగి బండేబసాపూర్ తండాలో జరిగింది. శుక్రవారం ఘటనాస్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. వెంటనే అతన్ని ఒక ఆటోలోకూడ్లిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతను చనిపోయినట్లు ప్రకటించారు. మృతుడి తండ్రి ఉమేశ్,తల్లి సుశీలాబాయికి ఒకే కుమారుడు. అతిన్ని వదిలి పనికోసం వలస వెళ్లారు. అతిడి చిన్ననాయన ఇచ్చిన వాంగ్మూలం ఆదారంగా కూడ్లిగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మృతదేహాన్ని కూడ్లిగి ప్రభుత్వ ఆసుపత్రి శవాగారంలో భద్రపరిచారు. కూడ్లిగి తహసీల్దార్ నేత్రావతి, కూడ్లిగి రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రభు, గ్రామ పాలనాధికారి సిద్దప్ప మృతదేహాన్ని సందర్శించారు.



పాండునాయక్ (ఫైల్)

## కూలి పనులకు వెళ్లి మృత్యువాత

### కడప జిల్లా బలపనూరు వద్ద రోడ్డు ప్రమాదం

**యాడికి వాసి దుర్మరణం**



వెంకటరామముడు (ఫైల్)

యాడికి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపురం గ్రామానికి చెందిన వెంకటరాముడు (32) కడప జిల్లాకు కూలి పనులకు వెళ్లి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఓబులాపురం గ్రామస్తులు తెలిపిన వివరాలమేరకు.. వెంకటరాముడు అరటికాయలు కోసే కూలి పనులకు కడప జిల్లాకు వెళ్లాడు. శుక్రవారం అక్కడ ద్విచక్రవాహనంలో పనికి వెళ్తుండగా బలపనూరు వద్ద జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో వెంకటరాముడు అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటరాముడు మృతదేహాన్ని పులివెందుల ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. వెంకటరాముడుకు భార్య మాధవి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి మృతి



బాబు (ఫైల్)

రామగిరి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన టీడీపీ మైనార్టీసెల్ మండల కోశాధికారి బాబూ(45)శుక్రవారం మృతి చెందారు. కుటుంబసభ్యులు, గ్రామస్థులు తెలిపిన మేరకు... కొండాపురం గ్రామానికి చెందిన బాబు పని నిమిత్తం కర్ణాటకలోని తిరుమణికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తిమ్మాపురం గ్రామ సమీపంలో రాత్రి బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన గల గుంతలోకి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన ఆయన లేవలేక తెల్లవారే వరకు అక్కడే ఉన్నాడు. తెల్లవారుజామున అటువైపు కూలి పనులకు వెళ్తున్న స్థానికులు చూసి, బాధితుడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. బాబును పావగడ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య సఫూరా, కుమారులు ఇర్షాన్, బాబు ఉన్నారు. మండలానికి చెందిన టీడీపీ నాయకులు పలువురు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## కుక్కల బెడదను తగ్గించేందుకు చర్యలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాల్లో కుక్కల బెడదను తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి సూచించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలోని తన చాంబర్‌లో పంచాయతీ అధికారులు, మెడికల్ అధికారులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. పంచాయతీలను క్లస్టర్లుగా విభజించి, ఒక్కో పంచాయతీకి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, గ్రామస్థాయి పంచాయతీ అధికారి, మెడికల్ ఆఫీసర్‌ను అప్రమత్తం చేయాలన్నారు.

# ఈదురుగాలుల బీభత్సం..!

- 1050.47 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- రూ.10.29 కోట్ల నష్టం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

అనంతపురం అర్బన్/నెట్‌వర్క్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. జిల్లాలోని కంబదూరు, కళ్యాణదుర్గం, కూడేరు, బ్రహ్మసముద్రం బెలుగుప్ప, ఉరవకొండ, కుందుర్పి, రాయదుర్గం శెట్టూరు, కణేకల్లు, గుమ్మఘట్ట మండలాల్లో 131.47 హెక్టార్లలో రూ.3.15 కోట్ల విలువైన అరటి, మామిడి, బొప్పాయి, చీనీ, దానిమ్మ, కర్బూజ తదితర పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయశాఖ పరంగా రాయదుర్గం, గార్లదిన్నె, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, బెలుగుప్ప, డి. హిరేహాళ్ మండలాల్లో 919 హెక్టార్లలో రూ.7.14 కోట్ల విలువైన మొక్కజొన్న, వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 1050.47 హెక్టార్లలో రూ. 10.29 కోట్ల విలువైన వివిధ రకాల పంటలు దెబ్బతిన్నట్లు ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. కోతదశలోని పంటలు దెబ్బతినడంతో బాధిత రైతులు గుండెలు బాదుకుంటున్నారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

### 11 మండలాల్లో వర్షం



కూడేరు మండలంలో నేలకొరిగిన అరటి చెట్లను చూపుతున్న రైతు వెంకటనారాయణ

జిల్లాలోని 11 మండలాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా ఆత్మకూరులో 35.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్ 30.0, గుమ్మఘట్ట 28.8, బ్రహ్మసముద్రం 15.0, శెట్టూరు 14.6, కణేకల్లు 13.2, డి. హిరేహాళ్ 11.8, కళ్యాణదుర్గం 8.6, కూడేరు 7.6, తాడిపత్రి 7.2, శింగనమల 4.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. శుక్రవారం జిల్లాలోని పలుప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. కూడేరు, బొమ్మనహాళ్, గార్లదిన్నె మండలాల్లో ఓ మోస్తారు వాన పడింది. యాడికి , గుత్తి, ఉరవకొండ మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఈదురుగాలులు వీశాయి.

### అరటి పంట నేలమట్టం

కళ్యాణదుర్గం రూరల్ మండలంలో ఈదురుగాలతో కూడిన వర్షానికి అరటితోట నేల మట్టమైంది. మండలంలోని పాలవెంకటాపురం గ్రామంలో రైతు వెంకటేశులుకు చెందిన ఐదెకరాల్లో అరటి పంట నేలమట్టమైంది. పంట చేతికొచ్చిన సమయంలో భారీ ఈదురుగాలులతో కూడిన వర్షానికి పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు బాధిత రైతు వాపోయాడు. రూ.10 లక్షలకుపైగా పంటనష్టం జరిగిందని బాధిత రైతు ఆవేదన చెందాడు. ప్రభుత్వం పంటనష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నాడు. అలాగే కళ్యాణదుర్గం రూరల్ పరిధిలోని మల్లికార్జునపల్లికి చెందిన రైతు బడప్పకు చెందిన ఐదెకరాల్లో మొక్కజొన్న పంట నేలమట్టమైంది. పంట కోత సమయంలో ఈదురుగాలులకు పంట పూర్తిగా దెబ్బతినడంతో రూ.4 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.



బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లి వద్ద నేలకూలిన బొప్పాయి పంట

### కూడేరు మండలంలో..

ఈదురు గాలులకు మండలంలో అరటి పంట నేలకొరిగింది. మామిడి తోటల్లో కాయలు రాలిపడ్డాయి. మండలంలోని చోళసముద్రం, మరుట్ల, ఎంఎంహళ్లి, కడదరకుంట, జయపురం తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షానికి అరటి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. కోతదశలోని అరటి ఈదురుగాలులకు నేలకొరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చోళసముద్రం గ్రామానికి చెందిన రైతు వెంకటనారాయణ సాగుచేసిన ఐదున్నర ఎకరాల్లో అరటి పంటను నాలుగు రోజుల్లో కోయాల్సి ఉండగా.. ఈదురుగాలులకు దెబ్బతింది. కడదరకుంటకు చెందిన గుడిపూటి సురేష్‌కు చెందిన మామిడితోటలో కాయలు నేలరాలడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

### మామిడి నేలపాలు..

కుందుర్పి మండలంలోని పలు గ్రామాల్లో మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ సారి అరకొరగా వచ్చిన దిగుబడి కూడా ఈదురుగాలులకు నేలరావడంతో బాధిత రైతుల గగ్గోలు పెడుతున్నారు.

### పడిపోయిన విద్యుత్ స్తంభాలు

బ్రహ్మసముద్రం మండలంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సానికి అరటి, బొప్పాయి, మొక్కజొన్న, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ప్రజలు అంధకారంలో గడపాల్సి వచ్చింది. నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సందీప్‌కు చెందిన అరటి తోట నేలకొరిగింది. సంతేకొండాపురం, తీటకల్లు, యాటకల్లు, రాయలప్పదొడ్డి గ్రామాల్లో మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. గుండిగానిపల్లిలో బొప్పాయి పంట నేలమట్టమైంది.

### బెళుగుప్పలో..

మండలంలో గురువారం రాత్రి ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. నరసాపురంలో 50 ఎకరాలు, రమణేపల్లిలో 35 ఎకరాల్లో మొక్కజొన్న, నాలుగెకరాలల్లో అరటి, దుద్దేకుంటలో 20 ఎకరాల్లో మొక్కజొన్న, బెలుగుప్పలో పదెకరాల్లో మొక్కజొన్న, యలగలవంకలో నాలుగెకరాల్లో బొప్పాయి, గుండ్లపల్లిలో నాలుగెకరాల్లో మొక్కజొన్న, గంగవరంలో 8 ఎకరాల్లో అరటి, అంకంపల్లిలో 4 ఎకరాల్లో అరటి పంటలు దెబ్బతిన్నాయి.





రాయదుర్గం మండలంలో పడిన వడగండ్లు

కూడేరు మండలంలో నేలరాలిన మామిడి కాయలను పరిశీలిస్తున్న అధికారులు



బెళుగుప్ప మండలం నరసాపురంలో నేలవాలిన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు రవికుమార్

### ముంచిన వడగండ్ల వాన

బొమ్మనహాళ్ మండలంలో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, చెట్లు నేలకూలాయి. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బొమ్మనహాళ్ మండల కేంద్రంతో పాటు శ్రీధరఘట్ట, గోనేహాళ్, దేవగిరి, ఉప్పరహాళ్, సింగానహళ్లి ఉద్దేహాళ్, లింగదహాళ్, రంగాపురం క్యాంపు గ్రామాల్లో వరి, పత్తి, అరటి, మామిడి, దానిమ్మ పంటలు దెబ్బతిన్నాయి. వడగండ్ల వాన పడటంతో వేల ఎకరాల్లో వరి ధాన్యం గింజలు రాలిపోయాయి. గోనేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల్లో చేతికందే దశలో వరి ధాన్యం గింజలు నేలపాలయ్యాయని బాధిత రైతులు, బలరాంరెడ్డి, జగన్నాథ్ రెడ్డి, బండూరు మల్లికార్జున, దాసరి ధనంజయ, కేశవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

### వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు నష్టం

కణేకల్లు మండలంలోని పలు గ్రామాల్లో 433 హెక్టార్లల్లో వరి పంట, 231 హెక్టార్లల్లో మొక్కజొన్న, 75 హెక్టార్లలో పత్తి పంటలు దెబ్బతిన్నాయి.

### రాయదుర్గంలో..

మండలంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షానికి భారీగా పంటనష్టం జరిగింది. రాయదుర్గం మండలంలోని జుంజురంపల్లి, నాగిరెడ్డిపల్లి, వేపరాల, ఆవులదట్ల, వజ్రవన్నూరు, కెంచానపల్లి, కొండాపురం, వీరాపురం మరియు బాగినాయకనహళ్లి గ్రామాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. మండలంవ్యాప్తంగా 220 మంది రైతులకు చెందిన 307 హెక్టార్లలో రూ.26 లక్షల విలువైన మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

### ఉద్యాన పంటలకు భారీ నష్టం

రాయదుర్గం రూరల్ మండలంలోని కదరంపల్లి, ఆవులదట్ల, వేపరాల, నాగిరెడ్డిపల్లి, రేకులకుంట తదితర ప్రాంతాల్లో సాగుచేసిన ఉద్యాన పంటలు ఈదురుగాలులకు నేలకొరిగాయి. దీంతో అపార నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. ఆవులదట్ల గ్రామానికి చెందిన రైతు ధర్మనాయక్ మామిడి తోటలో కాయలు నేలపాలయ్యాయి. అదే రైతుకు చెందిన ఫాంహౌస్ రేకులు గాలికి ఎగిరిపోయాయి. తద్వారా రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. రేకులకుంట గ్రామానికి చెందిన రైతు సీతారాంరెడ్డికి చెందిన నాలుగెకరాల్లో చీనీ మొక్కలు నేలకొరిగాయి. బొప్పాయి 37 ఎకరాలు, అరటి 17 ఎకరాలు, గుమ్మడికాయ 8 ఎకరాలు, చీనీచెట్లు మూడెకరాల్లో పంట పూర్తిగా దెబ్బతినడంతో దాదాపు రూ.35 లక్షల వరకు పంటనష్టం వాటిలినట్లు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.



కణేకల్లులో దెబ్బతిన్న వరిపంట




## కళ్యాణం.. వైభోగం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



కళాకారుల నృత్యం





పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు



ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం



సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

## బాలికపై అత్యాచారం



నార్పల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పన్నెండేళ్ల బాలికపై శుక్రవారం సాయంత్రం మహేష్ అనే యువకుడు అత్యాచారం చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు, బుక్కరాయసముద్రం మండలం సంజీవపురం గ్రామానికి చెందిన మహేష్. గొర్రెల ఎరువు కోసం నార్పలకు వచ్చాడు. ఆ ఇంటి వద్ద బాలిక ఒంటరిగా ఆడుకుంటూ కనిపించింది. దీంతో బలవంతంగా ఇంట్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేశాడు. బాలికకు తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలు తన తాతకు ఫోన్ చేసి సమాచారం తెలియజేసింది. కుటుంబ సభ్యులు బాలికను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మహేష్‌ను పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై పోక్సో కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

## బంగారం వ్యాపారి ఆత్మహత్య

**పోలీస్ స్టేషన్ ఎదుట రసాయనం తాగిన గౌసుల్లా**

**తాకట్టు బంగారాన్ని కొనుగోలు చేయడంతో వివాదం**



గౌసుల్లా (ఫైల్)

తాడిపత్రి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట బంగారం దుకాణ నిర్వాహకుడు గౌసుల్లా(46) శుక్రవారం రసాయనం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తాకట్టు బంగారాన్ని కొనుగోలు చేసిన వివాదంలో పోలీసులు, మరికొందరు వేధించడంతో గౌసుల్లా ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తాడిపత్రిలోని ఓ ప్రైవేట్ గోల్డ్‌లోన్ కంపెనీలో మహమ్మద్ రఫీ అనే వ్యక్తి పది తులాల బంగారాన్ని తాకట్టుపెట్టి 2023 డిసెంబరులో రుణం తీసుకున్నాడు. దీనికి అదే కంపెనీలో పనిచేస్తున్న అతని స్నేహితుడు జిలాన్‌బాషా సాయం చేశాడు. ఆ తరువాత రఫీకి తెలియకుండా తాకట్టు బంగారాన్ని జిలాన్ బాషా అమ్మేశాడు. 'వేలానికి వచ్చిన బంగారం.. తక్కువ ధరకు ఇప్పిస్తా' అని చెప్పి గౌసుల్లాకు విక్రయించాడు. సరిగ్గా ఏడాది తరువాత తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకునేందుకు జిలాన్ బాషాను రఫీ సంప్రదించాడు. అతను స్పందించకుండా కాలం గడిపి, రెండు నెలల క్రితం ఊరు విడిచి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తానే గాలించి, బళ్లారిలో ఉన్న జిలాన్‌బాషాను పట్టుకువచ్చి రెండు రోజుల క్రితం పోలీసులకు అప్పగించాడు. బంగారాన్ని గౌసుల్లాకు విక్రయించానని జిలాన్‌బాషా చెప్పడంతో పోలీసులు గౌసుల్లాను పిలిపించారు. వేలంలో అమ్ముతున్నారని జిలాన్ చెప్పడంతో తాను మూడు తులాల బంగారాన్ని కొనుగోలు చేశానని, డబ్బులు అప్పుడే చెల్లించానని గౌసుల్లా పోలీసులకు తెలిపాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా గౌసుల్లాను పోలీసులు స్టేషన్‌కు పిలిపించడం, గౌసుల్లా ఇంటి వద్దకు మహమ్మద్ రఫీ, పోలీసులు వెళ్లడం వంటి సంఘటనలు జరిగాయి. ఎస్ఐ గౌస్‌బాషా శుక్రవారం ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించారు. పది తులాల బంగారంతో తనకు సంబంధం లేదని, కొన్నది మూడు తులాలేనని, డబ్బులు కూడా ఇచ్చేశానని గౌసుల్లా చెప్పినా సమస్య పరిష్కారం కాలేదు. ఏదైనా ఉంటే బయటకు వెళ్లి మాట్లాడుకోవాలని ఎస్ఐ సూచించారు. దీంతో స్టేషన్ బయటకు వెళ్లిన గౌసుల్లా.. తన ద్విచక్రవాహనంలో ఉన్న రసాయనం బాటిల్‌ను తీసుకుని తాగేశాడు. వెంటనే పోలీసులు, స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గౌసుల్లా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతని బంధువులు పెద్దఎత్తున పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. పోలీసుల వేధింపుల కారణంగానే గౌసుల్లా ఆత్మహత్య చేసుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గౌసుల్లాకు భార్య తస్లీమ్, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గౌసుల్లా కుమారుడు నజీరుద్దీన్ ఫిర్యాదు మేరకు మహమ్మద్ రఫీ, అతని తమ్ముడు హాజీ, జిలాన్ బాషాపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



తాడిపత్రి పోలీస్ స్టేషన్ వద్ద గౌసుల్లా కుటుంబ సభ్యులు, బంధువులు

## మట్టి పెల్లలు విరిగిపడి ముగ్గురు చిన్నారుల మృతి..?

**మలయనూరు చెరువులో అనుమానాస్పద ఘటన**

**బాధితులు బొగ్గులు కాల్చే మహారాష్ట్ర కుటుంబాలు**

**గుట్టుచప్పుడు కాకుండా తరలించిన ఏజెంట్..?**

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు**



మహారాష్ట్ర కూలీలను విచారిస్తున్న ఎస్ఐ నగేష్

కుందుర్పి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలయనూరు సమీపంలో మట్టి పెల్లలు విరిగిపడి ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారని విశ్వసనీయంగా తెలిసింది. గ్రామ సమీపంలోని చెరువులో మహారాష్ట్రకు చెందిన 15 కుటుంబాలు బొగ్గులు కాల్చే పని చేస్తున్నారు. కొన్ని నెలలుగా వారు అక్కడే గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. పెద్దలు గురువారం పనిలో నిమగ్నమై ఉండగా, చిన్నారులు ఆడుకునేందుకు చెరువులోని గుంతల్లోకి వెళ్లారని, వారిపై మట్టి పెల్లలు విరిగిపడ్డాయని తెలిసింది. మట్టిలో కూరుకుపోయిన జ్యోతి (14), మార్వత్(10), అనీత్(9) మృతిచెందారని, బార్క్(11) అనే చిన్నారి తీవ్రంగా గాయపడ్డారని తెలిసింది. చెరువులో ఇసుక తవ్వకాల కారణంగా ఏర్పడిన గోతులే ప్రమాదానికి కారణమని తెలిసింది. శ్రీకాంత్ రాథోడ్ అనే బొగ్గుల ప్రధాన ఏజెంట్ మహారాష్ట్ర నుంచి ఆ కుటుంబాలను ఇక్కడికి తీసుకువచ్చి పని కల్పించారని సమాచారం. మృతి చెందిన ముగ్గురు చిన్నారులు విలాస్ అనే వ్యక్తి సంతానమని తెలిసింది. విషయం తెలుసుకున్న ప్రధాన ఏజెంట్, బాధిత కుటుంబాలను, చిన్నారుల మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా సొంత వాహనంలో మహారాష్ట్రకు తీసుకెళ్లినట్లు తెలిసింది. తీవ్రంగా గాయపడ్డ చిన్నారి బార్క్(11)ను బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రితో చేర్పించారని తెలిసింది. విషయం తెలుసుకున్న మలయనూరు గ్రామస్థులు, పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లి విచారించారు. అక్కడున్నవారు సరైన సమాచారం ఇవ్వలేదు. ఎస్ఐ నగేష్ తమ సిబ్బందితో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్న ప్రాంతాన్ని శుక్రవారం పరిశీలించారు. బొగ్గులు కాల్చే పనిలో ఉన్న కూలీలను విచారించారు. ఎవరి నుంచీ సరైన సమాచారం లభించడం లేదని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ నగేష్ తెలిపారు.



ప్రమాదం జరిగినట్లు భావిస్తున్న ప్రాంతం

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

### హనుమాన్ విజయోత్సవం



చైత్ర పూర్ణిమను భక్తులు హనుమాన్ విజయోత్సవంగా భక్తులు ఆచరిస్తారు. హనుమజ్జయంతికి ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారో అలాగే అన్ని రకాల ధార్మిక కైంకర్యాలు, రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. రావణ సంహారం అనంతరం అయోధ్యకు వచ్చిన శ్రీరాముడు పట్టాభిషిక్తుడయ్యాక, తన విజయానికి ఎంతగానో సహకరించిన హనుమంతుడిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని ఘనంగా సత్కరిస్తాడు. ఆనాడు జరిగిన సత్కారానికి చిహ్నంగా ప్రజలు నేటికీ విజయోత్సవంగా ఆచరిస్తున్నారు.

### మోక్షగుండం విశ్వేశ్వరయ్య (వర్ధంతి)




'భారతరత్న' గ్రహీత, దేశం గర్వించదగిన ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 1861 సెప్టెంబరు 15న కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్ళాపుర తాలూకా ముద్దేనహళ్ళిలో జన్మించారు. వీరి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా మోక్షగుండం గ్రామానికి చెందినవారు. 1915లో మైసూరు దివానుగా ప్రజల మన్నన పొందే కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణరాజ సాగర్ (కేఆర్ఎస్) డ్యామ్‌కు చీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. హైదరాబాద్ నగరాన్ని వరదలనుంచి రక్షించేలా వ్యవస్థను, విశాఖపట్నం ఓడరేవుకు సముద్రపు కోతనుంచి రక్షించే వ్యవస్థలో కీలకపాత్ర వహించారు. భావి ఇంజనీర్లకు స్ఫూర్తిగా నిలిచారు. 101వ యేట 1962 ఏప్రిల్ 12న కన్నుమూశారు.

### కుమారన్ ఆశాన్ (జయంతి)




మహాకవి ఎన్ కుమారన్ ఆశాన్ 1873 ఏప్రిల్ 12న ట్రావెన్‌కోర్‌లో జన్మించారు. సామాజిక సంస్కర్త, తత్వవేత్త, మళయాళ సాహిత్యంలో కవి. నారాయణ గురు శిష్యుడిగా రాణించారు. 20వ శతాబ్దం తొలినాళ్లలో మళయాళ సాహిత్యానికి కొత్త పుంతలు తెచ్చినవారుగా పేరొందారు. అలాగే సుబ్రమణ్య శతకం, శంకర శతకం వంటి రచనలు, పద్యాలు పేరొందాయి. 1924 జనవరి 16న కన్నుమూశారు. ఆయన జ్ఞాపకార్థం 1973లో పోస్టల్‌స్టాంపు విడుదల చేశారు.

### వినూ మన్కడ్ (జయంతి)



క్రికెటర్‌గా అంతర్జాతీయ స్థాయిలో రాణించి 'పద్మభూషణ్' పురస్కారాన్ని అందుకున్న ముల్వంత్‌రాయ్ హిమ్మత్‌లాల్ వినూ మన్కడ్ 1917 ఏప్రిల్ 12న గుజరాత్ రాష్ట్రం జామ్‌నగర్‌లో జన్మించారు. 1956లో ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్‌గా పంకజ్ రాయ్‌తో కలసి 413 పరుగులు చేశారు. 52 ఏళ్లపాటు రికార్డుగా నిలిచింది. 44 టెస్ట్ మ్యాచ్‌లలో ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా ఆడారు. 5 టెస్టు సెంచరీలు, 162 వికెట్‌లు పొందారు. 1978 ఆగస్టు 21న కన్ను మూశారు. ఆయన గౌరవార్థం ముంబైలోని వాంఖడే స్టేడియం సమీపాన ఒక రోడ్డుకు మన్కడ్ పేరు పెట్టారు.

### ఎఫ్ఎన్ సౌజా (జయంతి)



ఫ్రాన్సిస్ న్యూటన్ సౌజా 1924 ఏప్రిల్ 12న గోవాలో జన్మించారు. గొప్ప కళాకారుడిగా పేరొందారు. ముంబైకు చెందిన ప్రోగ్రెసివ్ ఆర్ట్ గ్రూప్ సంస్థాపక సభ్యుడు. స్వాతంత్ర్యానంతరం దేశ కళాకారులలో ఒకరిగా గుర్తింపు పొందారు. 1960 దశకంలో అక్రిలిక్ కళాఖండాలను గీసిన తొలి భారతీయుడిగా పేరొందారు. ఆయన గీసిన కళాఖండాలు ప్రపంచవ్యాప్తంగా పలు మ్యూజియంలలో ప్రదర్శనలో ఉన్నాయి. 2002 మార్చి 28న కన్నుమూశారు.

## ఈ- శ్రమ్‌లో నమోదు చేయండి

### కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. దీనిపై కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ.. జిల్లాలో అర్హత గల అన్నిరంగాల కార్మికులను ఈ పోర్టల్ నమోదు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు ఈకార్మికులకు అందేలా చూడాలన్నారు. ఉపాధికూలీలు, అంగన్‌వాడీ వర్కర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

# అవినీతి ప్రభుత్వమని కాంగ్రెస్ నేతలే ఒప్పుకున్నారు

**» బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర**

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అత్యంత అవినీతిలో కూరుకుపోయిన ప్రభుత్వమని ప్రతిపక్షాలు వ్యాఖ్యలు చేయడం లేదని సొంత పార్టీ సీనియర్ నేత, ముఖ్యమంత్రి ఆర్థిక సలహాదారుడు బసవరాజరాయరెడ్డి సర్టిఫికెట్ ఇచ్చారని బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర వెల్లడించారు. శుక్రవారం నిప్పాణి, యల్లాపురలలో జనాక్రోశ ర్యాలీలు జరిగాయి. అంబేడ్కర్ నిప్పాణికి వచ్చి వందేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా 'భీమ హెజ్జె 100' 'పేరిట' ప్రత్యేక సభను కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి బెంగళూరులో విధానసౌధ వద్ద ప్రారం భించారు. దేశంలో ఒరిజినల్ గాంధీలు లేరని అంతా నకిలీలే అన్నారు. దళితుల పేరిట ఓట్లు తీసుకునే కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎవరూ అంబే ద్కర్ గురించి కనీసంగా కూడా స్పందించలేదన్నారు. అంబేడ్కర్ నిప్పాణికి వచ్చారనే సమాచారమే సంతోషం కలిగించే అంశమన్నారు. అంబేడ్కర్‌ను రెండుసార్లు ఓడించింది కాంగ్రెస్సే అన్నారు. అంబేడ్కర్‌పై గెలుపొందిన కార జోల్కర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం పద్మవిభూషణ్ ఇచ్చిందన్నారు. ఇటీవల అంబే ద్కర్ పేరిట రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షనేతలు అశోక్, ఛలవాది నారాయణస్వామి, ఎంపీలు గోవింద కారజోళ, పీసీ మోహన్‌తోపాటు వందలాదిమంది పాల్గొన్నారు.

## రూ.10కోట్ల అంబర్‌గ్రీస్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కార్లు, అంబర్‌గ్రీస్, నిందితులతో పోలీసులు

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం నుంచి సుమారు 10 కోట్ల రూపాయల విలువైన 10కేజీల 390 గ్రాముల అంబర్‌గ్రీస్ (తిమింగళం వాంతి)ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను కొడగు జిల్లా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కొడగు జిల్లా విరాజ్‌పేట టౌన్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి అక్రమంగా అంబర్‌గ్రీస్ తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. చటోళి గ్రామం హెగ్గళ జంక్షన్ వద్ద రెండు కార్లను పరిశీలించి అంబర్‌గ్రీస్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులనుంచి రెండు నోట్లు లెక్కించే యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ కే కామరాజన్ తెలిపారు. తిరువనంతపురంనకు చెందిన షంషుద్దీన్ ఎస్ (45), ఎం నవాజ్ (54), కణ్ణూరు జిల్లాకు చెందిన లతీఫ్ (53), రిజేశ్ (40), ప్రశాంత్ (52), శివమొగ్గ జిల్లా భద్రావతికి చెందిన రాఘవేంద్ర (48), కాసరగూడుకు చెందిన బాలచంద్ర నాయక్ (55), క్యాలికట్‌కు చెందిన సాజుథామోస్, కణ్ణూరుకు చెందిన జోబిస్ (33), జిజేస్ (40)లు నిందితులుగా తెలిపారు. విరాజ్‌పేట డీఎస్పీ మహేశ్ కుమార్, సీఐ అనూప్ మాదప్ప, ఎస్సై ప్రమోద్, విరాజ్‌పేట సిబ్బంది, క్రైం బ్రాంచ్ సిబ్బంది కార్యాచరణలో పాల్గొన్నారన్నారు.

## మృతుల కుటుంబాలను ఆదుకోండి

బంగారపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వడ్రహళ్ళి చెరువులో మృతి చెందిన వారి కుటుంబీకులకు తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కర్ణాటక ప్రాంత రైతుసంఘం, బెంగళూరు - చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే బాధితుల రైతు పోరాట సమితి డిమాండ్ చేశాయి. ఈమేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ తాలూకాలోని రామసాగర గ్రామపంచాయతీ వడ్రహళ్ళికి చెందిన పంచాయతీ ఉద్యోగి రమేశ్ (36), కుమారుడు అగస్త్య(8), అదే గ్రామానికి చెందిన శంకరప్ప కుమారుడు శరణ్ (13)లు చెరువులో చిక్కుకుని మృతి చెందారన్నారు. విద్యార్థులు ఈతకు వెళ్లిన వేళ చెరువు బురదలో చిక్కుకున్నారని వీరిని రక్షంచే ప్రయత్నంలో రమేశ్ కూడా మృతి చెందారన్నారు. ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం చెరువునుంచి అధికారులు మట్టిని ఇష్టం వచ్చినట్టు తవ్వేశారని, ప్రజలు, పశువులకు రక్షణ కరువైం దన్నారు. మృత్యువాత చెందిన వారి కుటుంబాలకు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా కేశవరావ్, లక్ష్మీనారాయణ, వెంకటేశప్ప, గోవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.




తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

## నేడు వీరాంజనేయస్వామి రథోత్సవం

చింతామణి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తాలూ కాలోని ఊలవాడి గ్రామపంచాయతీ పరిధిలోని బూరగమాకలహళ్ళిలో కొలువైన వీరాంజనేయస్వామి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సీతా రామలక్ష్మణ సమేత హనుమంతుడి బ్రహ్మ రథోత్సవం శనివారం జరగనుంది. సుప్రభాత సేవ, కళశారాధన, బలిహరణ, మూలవిరాట్టుకు వెన్న అలంకరణ, పూలంగిసేవ, ఆస్థానసేవ, మధ్యాహ్నం రథాంగ హోమం అనంతరం సేవాకర్తలు, మారుతి సేవా ట్రస్టు అధ్యక్షుల సమ క్షంలో రథోత్సవాన్ని ప్రారంభించనున్నారు. పండరి భజన బృందాలు పాల్గొనన్నాయి. మాడికెరె వేణుగోపాల్ భజనమండలి ఆధ్వర్యంలో భక్తులకు పానకం సేవ, పెసరబేడల పంపిణీ, అన్న సంతర్పణ ఉంటాయి. సాయంత్రం ఊంజల్‌సేవ విద్వాన్ శ్రీనివాసులు బృందంచే నాదస్వర సంగీత కచేరి, అనంతరం సింహవాహనంపై పుష్పపల్లకి, రాత్రి 8.30 గంటలకు డాక్టర్ వినయ్‌రెడ్డి భాగవతార్‌చే హరికథా శ్రవణం కలదు.

### నేడు చాకవేలులో బ్రహ్మరథోత్సవం

చేళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తాలూకా లోని చాకవేలు గ్రామం నడిబొడ్డున వెలసిన పురాతన కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా చైత్ర పౌర్ణమిని పురస్కరిం చుకుని శనివారం మధ్యాహ్నం సుమారు 1గంటకు బ్రహ్మరథోత్సవం ఉంటుందని ఆలయ ధర్మకర్త కేఎల్ కృష్ణారెడ్డి, గ్రామపంచాయతీ అధ్యక్షులు రామలక్ష్మమ్మ, ఉపాధ్యక్షులు ప్రభా వతమ్మ తెలిపారు. రథోత్సవంలో చేళూరు తహసీల్దార్ శ్రీనివాసనాయుడు, ఉపతహసీల్దార్ పవిత్ర పాల్గొంటారన్నారు. సరిహద్దు ప్రాంతం కావడంతో చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారు కూడా పాల్గొంటారన్నారు. రథోత్సవం సంద ర్భంగా పానకం బండ్లు ఏర్పాటు చేస్తున్నామని, వడపప్పు, అన్నప్రసాద పంపిణీ ఉంటుందన్నారు. ఈనెల 16వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయని తెలిపారు.

## గురువందనలో పూర్వ విద్యార్థులచే సైకిళ్ల పంపిణీ

శిడ్లఘట్ట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చీమంగల గ్రామంలోని పూర్వ విద్యార్థులచే ప్రభుత్వ హైస్కూల్‌కు 10సైకిళ్ల పంపిణీ చేశారు. 2009-10 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు గురువందనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శివశంకర్, ఇతర ఉపాధ్యాయులచే మొక్కలు నాటారు. ప్రస్తుత విద్యార్థులకు ఉపయోగపడేలా పది సైకళ్లను అందచేశారు. ఉపాధ్యాయులు శోభా ఆర్, భారతి, కేశవభండారి, సౌభాగ్య జీఎస్, మమతా ఆర్, హేమావతి, శివశంకర్, యరణ్ణశెట్టి, పవన్‌శెట్టి, ముని వెంకటరమణప్ప, రాజణ్ణ, విఠల్, నవీన్‌కుమార్, ఏవీ రాజణ్ణలను శాలువాతో ఆత్మీయంగా సత్కరించారు. మహిళా ఉపాధ్యాయులకు వాయనం అందచేసి గౌరవించారు. పూర్వ విద్యార్థుల సాధనలను ఉపాధ్యాయులు అభినందించారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థుల బృందం

## రైతు కష్టాన్ని కాజేశారు

**● కందుల డబ్బు సైబర్ నేరగాళ్ల పాలు**

బెళుగుప్ప, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతు కష్టాన్ని సైబర్ నేరగాళ్లు కాజేశారు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్మగా వచ్చిన సొమ్మును అప్పనంగా దోచేశారు. మండల కేంద్రానికి చెందిన మహిళా రైతు నిర్మలమ్మ బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు ఈనెల 9న మూడు విడతల్లో రూ.99,400 కాజేశారు. దీనిపై పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆమె ఫిర్యాదు చేశారు. రైతు పండించిన 17 క్వింటాళ్ల కందులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో విక్రయించారు. అందుకు సంబంధించిన డబ్బు ఈనెల 9వ తేదీన రాత్రి ఆమె బ్యాంకు ఖాతాకు జమైంది. ఆ రాత్రే ఓ ఆమె ఫోన్‌కు సైబర్ నేరగాళ్ల నుంచి మెసేజ్ వచ్చింది. అదేదో తెలియని ఆమె దానిపై క్లిక్ చేసింది. అంతే.. ఆ తరువాత మూడు విడతల్లో రూ.24,500, రూ. 24,900, రూ.50వేలు మొత్తంగా రూ.99,400 సైబర్ నేరగాళ్లు కాజేశారు. విషయం తెలియని మహిళా రైతు ఈనెల 10న ఉదయం డబ్బు డ్రా చేసుకునేందుకు బ్యాంకు కెళ్లారు. అక్కడ విషయం తెలిసింది. దీనిపై బాధితురాలు.. సైబర్ సెల్ 1930 నంబర్, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## టీటీడీలో ఘనంగా వసంతోత్సవాలు



ఉత్సవమూర్తులకు పవిత్రోత్సవం చేస్తున్న అర్చకులు

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుబంధమైన వయ్యాలికావల్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంతోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండోరోజైన శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం జరిపారు. సాయంత్రం 6గంటలకు శ్రీవారి ఆస్థానం, ఊంజల్‌సేవ కొనసాగాయి. ఆలయ అర్చకులచే జరిగిన వసంతోత్సవాలకు శ్రీవారి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ సూపరింటెండెంట్ జయంతి, సిబ్బంది పర్యవేక్షించారు.

## అంబేడ్కర్ జయంతి ఏర్పాట్లపై సమావేశం



కరపత్రాలతో దళిత సంఘాల నాయకులు

ముళబాగిలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్ నేతృత్వంలో ఈనెల 14న అంబేడ్కర్ 134వ జయంతి జరగనుంది. దళిత సంఘాల ప్రముఖులు, వివిధ పార్టీల ప్రముఖులు, మహిళలు, రైతులు, యువకులు, విద్యార్థి సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని దళితపర సంఘాల మహాసమాఖ్య కోరింది. పట్టణంలోని ప్రవాసి మందిరం ఆవరణలో శుక్రవారం అంబేడ్కర్ జయంతి కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఈసారి అంబేడ్కర్ జయంతిని విభిన్నంగా ఆచరించాలని కోరారన్నారు. దళితులు, ఇతర వర్గాలవారు ఇంటిపై జై భీమ్ జెండాను ఎగురవేయాలన్నారు. సాయంత్రం 6 గంటలకు ఇంటి ముందు దీపం వెలిగించాలన్నారు. నూతన వస్త్రాలు ధరించి అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేయాల న్నారు. మీడియా సమావేశంలో దళిత నాయకులు వెంకటరవణప్ప, గొల్ల హళ్ళి వెంకటేశ్, మెకానిక్ శ్రీనివాస్, సోమణ్ణ మునిచౌడప్ప, సంగసంద్ర విజయ్ కుమార్, జమ్మనహళ్ళి కృష్ణ, కీలహొళలి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల కోసం సురక్షిత బీమా

బెంగళూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహిళలకోసం సురక్షిత బీమా పాలసీని బజాజ్ అలయెంజ్ సంస్థ ప్రవేశపెట్టింది. సంస్థ ఎండీ సీఈఓ తరుణ్‌టగ్ పేరిట శుక్రవారం నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు. లైఫ్ సూపర్ ఉమెన్ టర్మ్ పాలసీని తీసుకొచ్చామని, కేన్సర్‌తోపాటు 60 తీవ్రమైన జబ్బులకు బీమా వర్తించనుందని ప్రకటించారు. దేశంలో జీవితబీమాను పలు సంస్థలు అందిస్తున్నాయని, మహిళల ఆరోగ్యం దృష్ట్యా ప్రత్యేక పాలసీ ప్రారంభించినట్టు పేర్కొన్నారు.

## భూ వివాదాలు గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్



పుట్టపర్తి టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): భూవివాదాలను రెవెన్యూ అధికారులు నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ భవనంలో రెవెన్యూ సేవలపై శుక్రవారం జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి జిల్లాలోని ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ కమిషన్, లోకాయుక్త, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే వినతులను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలిచ్చిన అర్జీలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంతృప్తి సమాధానాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు సువర్ణ, మహేష్, వీవీఎస్ శర్మ, ఆనంద్, ల్యాండ్ సర్వే జిల్లా అధికారి విజయశాంతిబాయి, జిల్లాలోని తహసీల్దార్లు, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడే ఇంటర్ ఫలితాలు

అనంతపురం విద్య, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాలు శనివారం విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. గతనెల 1 నుంచి 15వతేదీ వరకూ పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 63 పరీక్షా కేంద్రాలకు 48,690 మంది విద్యార్థులను కేటాయించారు. మొదటి ఏడాది 25,730 మంది, రెండో ఏడాది 22,960 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో చాలామంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటల తర్వాత ఫలితాలు అందుబాటులో ఉంటాయని బోర్డు ప్రకటించింది. విద్యార్థులు తమ ఫలితాలను http://results-bie.ap.gov.in వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చు. మనమిత్ర వాట్సాప్ నంబర్ 9552300009 కు హాయ్ అని మెసేజ్ చేసి, ఫలితాలు పొందవచ్చు.





భక్తుల నడుమ తమిళుల సాంస్కృతిక ప్రదర్శన



నెమలి పించాలతో.. ఒంటి నిండా శూలాలతో..

# భక్తి విన్యాసాలు

**పంగణి నక్షత్రాన్ని పురస్కరించుకుని వేడుకలు**

**సుబ్రహ్మణ్యస్వామికి కల్యాణం, రథోత్సవం**

**పురంలో తమిళుల సంప్రదాయ వేడుకలు**

నోటికి శూలాలతో విన్యాసాలు చేస్తూ..



హిందూపురం అర్బన్ ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'తమిళుల అపార దైవ భక్తి చూస్తే ఆశ్చర్యమేస్తుంది. ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో చూపరులను ఆకట్టుకుంటారు' అని మునిసిపల్ చైర్మన్ రమేష్ పేర్కొన్నాడు. హిందూపురంలోని పళనీనగర్, ఇందిరా నగర్ ప్రాంతాల్లో స్థిరపడిన తమిళులు తమ సంప్రదాయం ప్రకారం పంగణి నక్షత్రంను పురస్కరించుకొని సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం, రథోత్సవాన్ని శుక్రవారం స్థానికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు తమిళ భక్తులు అక్కడ అగ్ని గుండం ఏర్పాటు చేసి, అందులో ప్రవేశించారు. అనంతరం చిన్నా పెద్ద తేడా లేకుండా నోటికి, కడుపునకు, వీపునకు శూలాలు గుచ్చుకొని విన్యాసాలు చేశారు. కొంత మంది వీపు, కాళ్లకు కొక్కీలు తగిలించుకొని క్రేన్‌కు వేలాడారు. ఈ సందర్భంగా తమిళులతో పాటు హిందూపురం పట్టణ ప్రజలు కూడా సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొకులు తీర్చుకున్నారు.

## కందువా మార్చేద్దామా..?

**టీడీపీ వైపు వైసీపీ కౌన్సిలర్ల చూపు**

పుట్టపర్తి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీలో ఉన్నా ఓటేసిన ప్రజలకు ఏమీ చేయలేకపోయాం. పేరుకు మున్సిపల్ కౌన్సిలర్లమైనా నిధులు లేవు, విధులూ లేవు. ఇంకో ఏడాదిలో పదవీ కాలం పూర్తవుతుంది. కనీసం ఈ పనిచేశామని చెప్పు కునేందుకైనా ఏదో ఒకటి చేయాలి. అందుకు అవసరమైన నిధులు అధికార పార్టీలో ఉంటేనే వస్తాయి. అందుకే పార్టీ మారితే బాగుంటుందన్న ఆలోచనలో పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఉన్నట్లు సమాచారం. ఈక్రమంలోనే కొందరు కౌన్సిలర్లు పార్టీ వీడి టీడీపీలోకి చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

**మీరు రమ్మంటే మేము వస్తాం..**

మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు ఉండగా అందులో వైసీపీకి 13 మంది, టీడీపీకి ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. ప్రస్తుతం వైసీపీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి దింపాలంటే టీడీపీకి మరో నలుగురు కౌన్సిలర్ల అవసరం ఉంది. టీడీపీ కౌన్సిలర్ చైర్మన్ అయితే అభివృద్ధికి నిధులు బాగా వస్తాయన్న ఆశ నెలకొంది. దీంతో కొందరు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

**అసంతృప్తే కారణమా?**

కౌన్సిలర్‌లుగా గెలిచినా నిధులు రాకపోవడం, ఏ మాత్రం ప్రాధాన్యం లేకపోవడంతో పార్టీ వీడేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. కనీసం ఆయా వార్డుల పరిధిలో వీధిలైట్లు వేయాలన్న అడుక్కోవాల్సిన పరిస్థితి వచ్చిందని పలువురు కౌన్సిలర్‌లు వాపోయినట్లు సమాచారం. ఒక సీసీరోడ్లులేదు, వీధిలైట్లు లేవు. తాగునీటి బోరు పాడైపోతే రిపేరీ చేయించుకోవడానికి కొందరు నాయకులను అడుక్కోవాల్సివచ్చిందని, నాలుగేళ్లలో నానా వేదన పడ్డామన్న అందుకే పార్టీ వీడటానికి సిద్ధమైనట్లు చెబుతున్నారు. టీడీపీ నాయకులతో మధ్యవర్తుల ద్వారా మంతనాలు జరుపుతున్నట్టు ప్రచారం సాగుతోంది.



## తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1585.14 | 1,579.07 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 1269 | 0 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 1,246 | 171 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 7.42 | 4.03 |

## పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా



బళ్లారి సిటీ, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కామన్ ఎంట్రన్స్(సీఈటీ 2025) పరీక్షలు ఏప్రిల్ 16, 17తేదిల్లో నగరంలోని 11పరీక్షా కేంద్రాలలో జరుగుతాయని, వీటిని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 200మీటర్లు వరకు నిషేదాజ్ఞలు అమలు చేయాలని, పరీక్ష కేంద్రాల పరిధిలోని జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్‌సెంటర్లను మూసివేయాలని ఆయన ఆదేశించారు. అనధికారిక వ్యక్తులు ,వ్యక్తుల సమూహాలు పరీక్షలు జరిగే ప్రాంతాల్లోకి ప్రవేశించరాదని సూచించారు.

## పంచాయతీ ఈఓగా శ్రీధర్ బారికర్



బళ్లారి రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బళ్లారి తాలుకా పంచాయతీ ఈఓగా శ్రీధర్ బారికేరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనులు నిర్వహిస్తున్న అధికారి ఈఓ మడిగిన బసప్ప సండూరు తాలుకా సండూరు ఈఓగా బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు.

## విద్యార్థినికి ఘన సన్మానం



పూర్వను సత్కరిస్తున్న అధికారులు

విజయనగరం (హోస్పేట), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విజయ నగరం జిల్లాకు చెందిన కుమారి పూర్వ పీయూ సైన్స్ ఫలితాల్లో రాష్ట్రంలో 6వ స్థానం సాధించింది. దీంతో జిల్లా యంత్రాంగం శుక్రవారం శాలువాతో విద్యార్థినిని ఘనంగా సత్కరించి అభినందించింది. విద్యార్థి 600 మార్కులకు గాను 594 మార్కులు సాధించిందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# పీయూ బోర్డు ఫెయిల్..!



● ఉభయ జిల్లాల్లో ఘోరంగా ఫలితాలు ● పరీక్ష తప్పిన 35 శాతం విద్యార్థులు
● అరకొర సిబ్బంది.. అతిథి అధ్యాపకులే గతి ● చక్కదిద్దని అధికారులు



బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ద్వితీయ పీయూ ఫలితాలను గమనిస్తే ఉభయ జిల్లాలో ఈ ఏడాది 9,286మంది ఫెయిల్(35.59) శాతం మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు అధికారిక గణాంకాలుతెలుపుతున్నాయి. ఇందుకు కారణాలు లేకపోలేదు. రెండు జిల్లాలపైకి ఈ ఏడాది 27,048 మంది పరీక్షకు నమోదు చేసుకోగా, పరీక్షకు హాజరైంది మాత్రం 26,093 విద్యార్థులు హాజరు కాగా, 16,807 మంది ఉత్తీర్ణత చెందగా, 9,286మంది ఫెయిల్ అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. అందులో బళ్ళారి జిల్లాలో 12,799 మంది ఇద్యార్థులు ద్వితీయ పీయూ పరీక్షలు రాయగా అందులో 4,199 మంది ఫెయిల్ అయ్యారు. ఇక విజయనగర జిల్లాలో 13,294మంది పరీక్షలు రాయగా, 5,087 మంది ఫెయిల్ అయ్యారు. ఫెయిల్ అయిన వారిలో ఎక్కువగా బాలురే ఉండడం విశేషం. రెండు జిల్లాలో చేరి మొత్తం 12,446 మంది పరీక్షలు రాయగా, 5,728మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఇందులో 13,647మంది బాలికలు పరీక్షలు రాయగా, 3,558మంది ఫెయిల్ అయ్యారు...

### ఆర్ట్స్ గ్రూపులు అంత సులువు కాదు...

ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చిన వారికి సామాన్యంగా అందరూ చెప్పే సలహా అంటే... ఆర్ట్స్ సబ్జెక్ట్ తీసుకో సులభం అంటారు. అయితే కళా విభాగంలో ఎక్కువమంది విద్యార్థులు ఫెయిల్ కావడం చూస్తుంటే... ఆర్ట్స్ సబ్జెక్ట్ అంతసులభం కాదనిపిస్తోంది. కళా విభాగంలో మొత్తం 9,493మంది పరీక్షలు రాస్తే అందులో 4,242 మంది ఫెయిల్ కావడం గమనార్హం. ఇది 44శాతం కంటే అధికమని చెప్పవచ్చు. సైన్స్ విభాగంలో కూడా మొత్తం 10,900 మంది విద్యార్థులు రాస్తే, 2,433 మంది విద్యార్థులు ఫెయిల్ కావడం కమనార్హం. ఇక వాణిజ్య విభాగంలో 6,510మంది విద్యార్థులకు పరీక్షలు రాయగా, 2,611 మంది విద్యార్థులు ఫెయిల్ కావడం గమనార్హం.

### ప్రధాన కారణాలు..

జిల్లాలో పీయూ కళాశాలల్లో బోధక సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. కొన్ని కళాశాలలో పర్మినెంట్ ఉపన్యాసకులు, ప్రిన్సిపాల్ పోస్టులు లేకపోవడం విడ్డూరం. చాలా కళాశాలలో అతిథి ఉపన్యాసకులే అన్ని నిర్వహించుకుంటూ పోతున్నారు. ప్రస్తుత ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గడానికి ఇదొక ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.

ఉభయ జిల్లాల్లో హాజరు శాతం తక్కువలో వేలాది మంది విద్యార్థులు ఉండడం గమనీయం. ఉపాధి కోసం విద్యార్థుల తల్లితండ్రులు ఇతర ప్రాంతాలకు వెళుతున్న కారణంగా ఆ ప్రభావం విద్యార్థుల చదువుపై పడుతోందని చెప్పవచ్చు. తల్లితండ్రులు వలసలు వెళితే ఇంటిపట్టున ఉన్న వృద్ధులు విద్యార్థుల చదువుపట్ల పరామర్శలేకపోవడం ఒక కారణంగా చెప్పవచ్చు. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు అందుబాటులోకి రావడంతో ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ ఉన్న కారణంగా ఉన్న సమయం అతా మొబైల్ చూడడానికి సరిపోతుంది. ఈ సమయంలో చదువుపట్ల ఆసక్తి కల్పోవడం ఉత్తీర్ణత శాతం తగ్గడానికి కారణంగా చెప్పవచ్చని ఉపన్యాసకులు అభిప్రాయ పడుతున్నారు. జిల్లాలో ఆర్థికంగా బాగా ఉన్నవారి కుటుంబాలు తమ పిల్లలను ఇతర జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల్లో చదివిస్తున్నారు. ప్రతిభావం విద్యార్థులు ఇతర జిల్లాలకు వెళ్లడం ఉత్తీర్ణత తగ్గడానికి కారణంగా విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు.

### వేధిస్తున్న బోధనా సిబ్బంది కొరత

బోధక సిబ్బంది కొరత జిల్లాను తీవ్రంగా వేధిస్తోంది. ప్రభుత్వ పియు కళాశాల్లో 400మంది ఉపన్యాస పోస్టులు ఉండగా, అందులో 200మందికి పైగా అతిథి ఉపన్యాసకులే ఉండడం గమనార్హం. అందులో కళ్యాణ కర్ణాటక విభాగం జిల్లాలో పైకి బళ్ళారి ఉత్తమ సాధన చేసిందని చెప్పవచ్చు. బుధవారం వెలువడిన ఫలితాల్లో అన్ని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించినట్లు, వెంటే ప్రత్యేక తరగతులు ఏర్పాటు పరీక్ష-2కు విద్యార్థులను సిద్దం చేయాలని సూచించినట్లు. ఫెయిల్ అయిన విద్యార్థులు తప్పిన సబ్జెక్టులలో ప్రిపేర్ కావాలని, విద్యార్థులు మానసికంగా కృంగిపోరాదని పియు కళాశాల పూర్వ శిక్షణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ పాలాక్షి పేర్కొంటున్నారు.

## 15న లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా

● టోల్‌ట్యాక్స్ పెంపును ఉపసహంరించుకోవాలి : అధ్యక్షుడు మించు శ్రీనివాస్ డిమాండ్



వినతిపత్రం అందజేస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బళ్లారి లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 15న ఆందోళన చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్ టోల్ ట్యాక్స్‌ను తగ్గించుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టనున్నట్లు లారీ అసోసియేషన్ అధ్యక్షుడు మించు శ్రీనివాస్ తెలిపారు. నగరంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏప్రిల్ వారు పలు డిమాండ్లతో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నూర్ మహమ్మద్, మహబూబ్ బాషా, లారీ ఓనర్స్, లారీ డ్రైవర్స్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

## వైభవంగా కల్యాణోత్సవం

కంప్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా పేరుగాంచిన హంపి పుణ్యక్షేత్రంలో శుక్రవారం కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. హంపి విరూపాక్షేశ్వరుడు, పార్వతి దేవికి పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య వైభవంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారు, స్వామికి మొక్కులు సమర్పించుకున్నారు.

## కనులపండువగా నవగ్రహ ప్రతిష్ఠ

సిరుగుప్ప, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ కన్నుల పండువగా జరిగింది. తాలుకాలోని దేవినగర్ గ్రామంలో పీయుజీ ఫౌండర్ ఛైర్మన్ కొల్లి అరుణ శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో శివాలయం ఆవరణంలో నవగ్రహాల విగ్రహప్రతిష్ఠ జరిగింది. రాఘవేంద్రస్వామి పూజారులు హోమం, శివునికి అభిషేకం గావించారు. అనంతరం గోమాతకు అర్చన చేశారు. పూజలు చేసి నవగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా కొల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండేళ్లుగా నవగ్రహాలను ప్రతిష్ఠించాలనే కోరిక నేటితో నెరవేరిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి నుంచి నవగ్రహాలను ఒకటిన్నర అడుగుల ఎత్తున తయారు చేయించి తెప్పించినట్లు తెలిపారు. దేవినగర్ గ్రామప్రముఖులు తుమ్మల నాగేశ్వరరావు, తుమ్మల కోటేశ్వరరావు, గోపాల్ రావు, ఈ ప్రతిష్ఠాపనకు సహకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీఎంసీ మాజీ డైరెక్టర్ ప్రతాప్ చౌదరి, ప్రముఖులు రాజప్ప, శ్రీహరి, వెంకటేశ్వర్లు, సీతారాంబాబు, సుగుణ కుమారి, ప్రభావతి, గ్రామప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.




పూజలో పాల్గొన్న భక్తులు

# హోసూరు జోన్

## ఘనంగా ఆర్ట్స్ కళాశాల స్నాతకోత్సవం



పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు

హోసూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మూడో స్నాతకోత్సవం ఉత్సాహంగా సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకీయమణి ప్రారంభించారు. కృష్ణగిరి ప్రభుత్వ మహిళా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చౌ గీత ప్రత్యేక అతిథిగా హాజరై పట్టాలు ప్రదానం చేశారు. జీవితం ఉన్నత లక్ష్యంగా సాగాలంటే ఎన్నో అడ్డంకులు ఉంటాయని వాటిని అధిగమించి ముందుకు సాగాలన్నారు. సమాజం మెచ్చుకునేలా ఇతరులకు ఆదర్శంగా వ్యవహరించాలని విద్యార్థులకు హితవు పలికారు. 1139 మంది డిగ్రీ, 222 మంది పీజీ పట్టాలు పొందారు. పట్టాలు అందుకున్న అందరినీ పేరుపేరునా ప్రొఫెసర్‌లు అభినందించారు.

## పట్టణంలో నీటి ఎద్దడిపై ఆందోళన



చెరువులో తగ్గిన నీటిమట్టం

హోసూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లో కీలకమైన రామనాయకన్ చెరువు సుమారు 156 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఎగువన పూనపల్లె చెరువు, జీగూరు చెరువు, దసరాపల్లె చెరువు, కర్నూలు చెరువు, అంతివాడి చెరువులు ఉన్నాయి. ఇవి నిండితే మిగులునీరు కాలువలద్వారా రామనాయకన్ చెరువుకు చేరేది. మూడు నాలుగు దశాబ్దాలక్రితం వరకు ఈ చెరువు చుట్టుపక్కల ప్రాంతాలలో సాగునీటి అవసరాలను తీర్చేది. వేసవిలో సైతం నీటి సమస్య ఉండేది కాదు. క్రమేణా నివాసాలు, వాణిజ్యభవనాలు పెరగడం, కాలువలపై ఆక్రమణలు, చెరువు చుట్టూ వాణిజ్య సముదాయాలు ఇతరత్రా నిర్మాణాలతో చెరువు విస్తీర్ణం క్రమేపీ తగ్గింది. దీనికితోడు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వ్యర్థపునీరు కూడా చేరుతుండడంతో కలుషితమవుతోంది. ఇటీవల చెరువును అభివృద్ధి చేసేలా థీమ్‌పార్క్‌కు సిద్ధమై కోట్లాదిరూపాయలు కేటాయించారు. పక్షులకోసం అక్కడక్కడ కొన్ని కట్టలను నిర్మించారు. దీంతో చెరువు విస్తీర్ణం తగ్గి కుంటలా మారిపోయింది. ఇటీవల ఎండల ప్రభావం పెరగడంతో నీటిమట్టం తగ్గింది. వేసవిలో నీటి ఎద్దడిపై సర్వత్రా నెలకొని ఉంది. ఇకనైనా తగిన చర్యలు తీసుకోనిపక్షంలో చెరువు ఆనవాళ్లు కూడా ఉండవని, జలమూలాలైన చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలు, పాలకులపై ఎంతో ఉందని పర్యావరణ ప్రేమికుల అభిప్రాయంగా ఉంది.

## ఎయిమ్స్ మంజూరుకు కావాల్సింది బుద్ధి బలమే..!

● సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్ వ్యంగ్యాస్త్రం

రాయచూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాయచూరు జిల్లాకు ఎయిమ్స్ మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఎయిమ్స్‌ను జిల్లాకు రప్పించే శక్తి బీజేపీ నాయకులకుందా..? అంటూ ఇటీవల రాష్ట్ర చిన్ననీటి పారుదల శాఖ మంత్రి ఎన్ఎస్ భోసరాజు చేసిన వ్యాఖ్యలపై సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్ తనదైన శైలిలో స్పందించారు. బీజేపీకి శక్తి ఉందా అని ప్రశ్నించిన మంత్రి, ఎయిమ్స్‌కు కావల్సింది మందబలం, కండబలం కాదని, కేవలం బుద్ధిబలం మాత్రమేనన్న విషయం తెలుసుకోవాలని అన్నారు. సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్, ఇతర నాయకులో కలిసి శుక్రవారం విలేఖరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రానికి ఎయిమ్స్ ఏర్పాటు కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నిబంధనల మేరకు లేఖ రాయడం లేదా అసెంబ్లీలో బిల్లు పాస్ చేయించడం వంటివి నిబంధనల మేరకు జరగాలన్నారు. దాని తదనంతరం తాము 100శాతం జిల్లాకు ఎయిమ్స్ వచ్చేందుకు కృషి చేస్తామని సిటీ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో కమీషన్‌ల బాగోతం నడుస్తుందంటు వచ్చిన ఆరోపణల పై ప్రభుత్వం స్పందించిన తీరు పట్ల సిటీ ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆరోపణలు చేయడం కాదు తగిన ఆధారాలు చూపి మాట్లాడాలంటు ప్రభుత్వం స్పందించడం సరికాదన్నారు. గతంలో బీజేపీ హయాంలోను కమిషన్‌ల పై కాంగ్రెస్ నాయకులు ఇదే రకమైన ఆరోపణలు చేశారని వారప్పుడు రుజువులు చూపారా..? అంటు ఎమ్మెల్యే ప్రశ్నించారు. వచ్చిన ఆరోపణలకు స్పందించి సరైన జవాబు చెప్పుకోవడం ప్రభుత్వం బాధ్యతనే తప్పా తిరకాసు మాటలు మాట్లాడడం సరికాదన్నారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల సమస్యను పక్కదారి పట్టించడమే తప్పా సరైన విధానం కాదన్నారు.



మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్



భూమిపూజలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి

## రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

బళ్లారి సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని వాల్మీకి సర్కిల్ నుండి వక్రాణి క్యాంప్ వరకు రూ.6కోట్ల వ్యయంతో జాతీయ రహదారి(150ఏ) అభివృద్ధి పనులను ఎమ్మెల్యే నారభరత్‌రెడ్డి భూమి పూజ చేసి ప్రారంభించారు. గురువారం సాయంత్రం వాల్మీకి సర్కిల్లో నిర్వహించిన భూమి పూజలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈపనిని ప్రజా పనుల శాఖజాతీయ రహదారుల ప్రాజెక్టు కింద చేపట్టినట్లు రోడ్డు అభివృద్ధి అంచనా వ్యయం రూ.6కోట్లు ఖర్చవుతుందన్నారు. త్వరలోనే పనులు పూర్తతాయని ఎమ్మెల్యే నారాభరత్‌రెడ్డి తెలిపారు. ఈసందర్భంలో మున్సిపల్ కార్పొరేషన్ సభ్యుడు కుబేర, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ,లోకేశ్, శ్రీనివాస్‌రెడ్డి, చరణ్‌రాజ్, యశోధ, ప్రజా పనుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కళలను ప్రోత్సహించాలి



జ్ఞాపికలు అందజేస్తున్న కళాట్రస్టు అధ్యక్షుడు గురుస్వామి

బళ్లారి సిటీ,ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక కళలను ప్రోత్సహించాలని ప్రముఖ కళాకారులు డా.వీణాకుమారి పేర్కొన్నారు. గురువారం రాత్రి తుంగ-గంగా సాంస్కృతిక కళాట్రస్టు ఆధ్వర్యంలో కాకర్లతోటలో నిర్వహించిన సాంస్కృతిక సంభ్రమ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. అనంతరం జీఆర్,వెంకటేశులు దర్శకత్వంలోని ప్రదర్శించిన రైతాంగం సాంఘిక నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. వసుందర బృందం నృత్యప్రదర్శన, రాధకృష్ణ ఏకపాత్ర అభినయం, సంగీతాలాపన భక్తుల మనస్సును దోచాయి. కళాకారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖులు వీ.రామచంద్ర, శ్రీనివాస్, గురుస్వామి,సూర్య, కృష్ణస్వామి, వీరేశ్, బాబు, నాగరాజు, రాజశేఖర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూలే జయంతి



పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అఖండ కర్ణాటక వాల్మీకి బళ్లారి జిల్లా సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు జోళదరాసి తిమ్మప్ప నేతృత్వంలో మహాత్మ జ్యోతిరావుపూలే 198వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు జోళదరాసి తిమ్మప్ప మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడి సమాజాన్ని సంపన్యానికి భావతరాలకు నిత్యస్ఫూర్తిగా నిలిచి దీన జన బాంధవుడిగా పూలే సమాజానికి సేవలందించారన్నారు. వెనుకబడిన తరగతుల ఆరాధ్య దైవంగా కొనియాడారు. కార్యక్రమంలో వాల్మీకి జిల్లా అధ్యక్షుడు ఎర్రగుడి ముద్ద మల్లయ్య దళితుల సంఘర్షణ సమితి అధ్యక్షులు కప్పగల్లు, ఓంకారప్ప, ఎస్పీ సర్కిల్ మల్లికార్జున, సంగనకల్లు విజయ్‌కుమార్, దుర్గన్న సంఘం పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉచిత విద్య



సమావేశంలో మాట్లాడుతున్న రెయిన్‌బో కార్యదర్శి చాంద్‌బాషా

కంప్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు కంప్లిలోని రెయిన్‌బో కళాశాలలో ఉచిత విద్య, వసతి, కేఎస్ కేసీబీ కళాశాలలో వ్యవస్థాపకులు చాంద్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరంలో 10వ తరగతిలో అత్యధిక మార్కుల ఆధారంగా ఉచిత విద్య, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. శుక్రవారం కంప్లి పట్టణంలోని సన్నాపురం రోడ్డులో కేసీబీ ఎడ్యుకేషనల్ ట్రస్టు రెయిన్‌బో కళాశాల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఐదు తాలుకాలలో కంప్లి, కురుగోడు, బళ్లారి, సిరుగుప్ప, సండూరు తాలుకాలో పదవ తరగతి కన్నడ మీడియం, ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠ్యాంశాల్లో చదివి, వారి వారి తాలుకాలో అత్యధిక మార్కులు సాధించిన ప్రతి తాలుకా నుండి నలుగురు విద్యార్థులకు ఈ అవకాశం కల్పిస్తామన్నారు. 20 మంది విద్యార్థులకు ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ.1.40 లక్షలు అందించబడుతుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలకు మంచి విద్యను అందించడానికి చొరవ తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. వివరాలకు 988090477, 9980572088 నెంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మహబూబ్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, షంషేర్, మేఘన పాల్గొన్నారు.

## గర్భాశయ క్యాన్సర్‌కూ చికిత్స

బళ్లారి సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సరైన చికిత్స పొందితే గర్భాశయ క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేయవచ్చని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ సుమంగళాదేవి అన్నారు. విజయనగరం జిల్లా హొసపేటలోని స్థానిక శ్రీమతి ఉగామాదేవి భవర్‌లాల్ నవార్ థియోసాఫికల్ ఉమెన్స్ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో 'గర్భాశయక్యాన్సర్ హెచ్‌పీవీ టీకా' పై ప్రత్యేక ఉపన్యాసంలో ఆమె మాట్లాడారు. హ్యూమన్ పాపిల్లోమావైరస్(హెచ్‌పీవీ),సంబంధిత వ్యాధులు 2015నివేదిక ప్రకారం భారతదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 1.2మిలియన్ల మంది మహిళలు సంబంధిత క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. వీరిలో దాదాపు 67వేల మంది మహిళలు బలవుతున్నారన్నారు. క్యాన్సర్‌ను నివారించడానికి క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించడం, కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించి మాట్లాడారు చికిత్సకంటే నివారణ మంచిదని విద్యార్థులను ఒప్పించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సుజాత, ప్రొఫెసర్ ఖిచడి చన్నప, అమృత్‌కుమార్, బోధన ,బోధనేతర సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుమంగళాదేవి